


నేటి దినపత్రిక **సూర్య** www.suryaa.com

**19** వ వసంతంలోకి ...

**ఎన్టీఆర్ కృష్ణా**

గురువారం 8 జనవరి 2026 పేజీలు 8


# కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం అంగీకారం



- స్టేషన్ ఆధునీకరణకు రూ.10 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు
- ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ : అమృత భారత్ 2.0 కింద కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి అంగీకరించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తో విజయవాడ రైల్వే స్టేషన్ కు ప్రత్యామ్నాయ రైల్వే స్టేషన్ గా గొల్లపూడి లోని బల్బ్ లైన్ల స్టేషన్ ఉపయోగ పడే అంశాన్ని పరిశీలించాలని కోరటం జరిగిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి, కొండపల్లివిజయవాడ రైల్వే ట్రాక్ వెంట డ్రైన్ల సమస్య, గొల్లపూడి రైల్వే స్టేషన్ స్థల పరిశీలనకు సంబంధించి రైల్వే అధికారులతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ జాయింట్ ఇన్స్పెక్షన్ బుధవారం చేయటం జరిగింది. ముందుగా కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి సంబంధించి ప్లాట్ ఫారమ్ ఎత్తు పెంచటం, ఇతరత్రా సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన అంశాలను పరిశీలించిన అనంతరం, కొండపల్లి విజయవాడ

మిగతా 2లో

# అభివృద్ధికి కేరాఫ్‌గా మచిలీపట్నాన్ని మారుస్తా



- రూ.33 కోట్ల కమ్మవారిచెరువు-చిన్నాపురం రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- రూ.6 కోట్లతో కాలేఖాన్‌పేట-చిన్నాపురం రోడ్డు పనులకు శంకుస్థాపన
- నియోజకవర్గంలో ప్రతి రోడ్డుకు మహర్దశ తీసుకొస్తాం
- మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డితో కలిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

వివరాలు 2లో

## ఆవకాయ అమరావతికి
# తొలగిన అడ్డంకులు

- పున్నమిఘాట్‌లో స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిన పున్నమిఘాట్ స్థల ప్రైవేట్ యజమానులు
- కలెక్టర్ జోక్యం తో సద్దుమనిగిన వివాదం
- స్థల యజమానులకు 5 లక్షల రూపాయలు ఇచ్చేందుకు అంగీకారం
- కలెక్టర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన పున్నమిఘాట్ స్థల ప్రైవేట్ యజమానుల సంఘం




విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : పున్నమిఘాట్‌లో ఈ నెల 8 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు టూరిజం శాఖ ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న ఆవకాయ అమరావతికి అడ్డంకులు తొలగిపోయాయి. కలెక్టర్ లక్ష్మీశా జోక్యంతో వివాదం సద్దుమనిగింది. స్థల యజమానులకు 5 లక్షల రూపాయలు ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకారం తెలపడంతో స్థల యజమానులు తన భూములను ఆవకాయ అమరావతి కార్యక్రమానికి

2

# కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు..

- చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- సంయుక్త బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాలి
- గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు అప్రమత్తంగా ఉండాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2 లో

వివరాలు 2లో

## రామవరప్పాడు పంచాయతీలో
# నిధులు గోల్మాల్...!

రూ.4 కోట్లపైనే నిధులు దుర్వినియోగంపై రామవరపాడు సర్పంచ్ శ్రీదేవి, పూర్వపు పంచాయతీ కార్యదర్శి గంటా రామ్మోహన్ రావు, పూర్వపు ఎంపీడీవో సునీతకు కూడా షోకాజ్ నోటీసులు.....!

(మొదటిపేజీ తరువాయి)



## రామవరప్పాడు పంచాయతీలో
# నిధులు గోల్మాల్...!

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామపంచాయతీలో రూ.4,04,32,360 నిధులను నిబం ధనలకు విరుద్ధంగా ఖర్చు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి వెల్లడించారు. సర్పంచి వరి శ్రీదేవి,పూర్వ గ్రామ కార్యదర్శి గంటా రామ్మో హన్రావు, పూర్వపు ఎంపీడీవో సునీతను బాధ్యులుగా గుర్తించి మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీదేవి, రూ.1,63,31,758, గ్రామ కార్యదర్శి, రూ.2,02,16,180, గ్రామ ప్రత్యేక అధికారులు రూ.37,84,421, చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు.నోటీస్ అందుకున్న 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరారు.తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు సర్పంచ్ నిధులు డ్రా చేసే అధికారాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. గ్రామపంచాయతీ సమర్పించే అన్ని చెక్కులపై సర్పంచ్ డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయవాడ రూరల్ వారి ప్రతి సంతకం తప్పనిసరిగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.గ్రామంలో ఇలాంటి సంఘటన జరగటం పట్ల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.ఇలాంటి వాటికి సంబంధించిన విషయాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో అని ఇలాంటి వారిపై ప్రభుత్వం ఏ విధంగా చర్యలు తీసుకుంటుందో అని గ్రామంలోని ప్రజలు వేచి చూస్తున్నారు.

## కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు..



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 07, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, చట్టాలపై గ్రామాలు మొదలు జిల్లాస్థాయి వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాటుచేసిన గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించాలని, వీఆర్వో, తహశీల్దార్, ఆర్డీవోల సారథ్యంలోని కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎక్కడా కోడి పందేలు జరక్కుండా చూడాలన్నారు. కోడిపందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని.. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్-1974లోని సెక్షన్-10, జంతు హింస నివారణ చట్టం-1960లోని సెక్షన్ 34 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. జంతు సంక్షేమ సంఘాల సలహాలు సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఇదేవిధంగా ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని.. ఈ సందర్భంగా జంతు సంక్షేమ సంస్థలు, జంతు సంక్షేమ సంఘాలతో పాటు రెవెన్యూ, విద్య, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. చర్చలు, ఇంటర్వ్యూలు, ర్యాలీలు వంటివాటితో పాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతిపాఠశాలలోనూ కైండ్నెస్ క్లబ్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, డీఈవో ఎల్.చంద్రకళ, జంతుసంక్షేమ సంస్థల ప్రతినిధులు రవికుమార్, వెంకటేశ్వర్లు, శ్రీపద్మ, పోలీసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం అంగీకారం

(మొదటిపేజీ తరువాయి)

రైల్వే ట్రాక్ పై నడుచుకుంటూ వెళ్లి డ్రైన్ల సమస్యను పరిశీలించారు. కొండపల్లి ఎస్టీ కాలనీ వద్ద రైల్వే ట్రాక్ కింద ఉన్న డ్రైనేజీలో ప్రతి ఏడాది వర్షాకాలం నీళు సక్రమంగా పారుదల కాక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు రైల్వే అధికారులకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వివరించారు. అలాగే గొల్లపూడి లోని బల్బ్ స్టేషన్ ను సందర్శించి అక్కడ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు అనువుగా వున్న స్థలాన్ని రైల్వే అధికారులతో కలిసి పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ రైల్వే స్టేషన్ కు గొల్లపూడి లోని బల్బ్ లైన్ల స్టేషన్ ప్రత్యామ్నాయ రైల్వే స్టేషన్ గా ఉపయోగపడుతుందన్నారు. బల్బ్ లైన్ల స్టేషన్ లో మూడు రైల్వే ట్రాక్స్ మధ్యలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు 150 ఎకరాల స్థలం అనుకూలంగా వుందన్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తో ఈ అంశం పై చర్చించగా....ఈ స్థలాన్ని రైల్వే అధికారులతో కలిసి పరిశీలించేందుకు రావటం జరిగిందన్నారు. కొండపల్లి రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తో కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో కూడా కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశంపై మాట్లాడటం జరిగిందన్నారు. కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి, ఆధునికీకరణకు సంబంధించి రూ.10 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు అధికారులు రైల్వే శాఖకు పంపించినట్లు తెలిపారు. రాజధాని అమరావతికి ఉపయోగపడే విధంగా కొండపల్లి రైల్వే స్టేషన్ వుంటుందని, త్వరలోనే ఈ స్టేషన్ ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగుతాయన్నారు. ఇప్పటికే కొండపల్లి నుంచి గొల్లపూడి రైలు మార్గంలో వున్న ఎల్.సి నెంబర్ 147, 148 ఆర్వోబిలకు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. ఎల్.సి నెంబర్ 140 కి ఆర్.యు.బి మంజూరు కాగా, ఎల్.సి.నెంబర్ 150కి మంజూరైన టూ లైన్ ఆర్.వో.బి ను 4 లైన్ ఆర్.వో.బి చేయాలని కోరటం జరిగిందన్నారు. కొండపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యలతో పాటు, ఈ రైల్వే ట్రాక్ ఏరియాలో కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై రైల్వే శాఖ ఉన్నతాధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరిన మేరకు, ఇక్కడి సమస్యలను రైల్వే అధికారులకు స్వయంగా చూపించి, వివరించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కొండపల్లి రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అమృత్ భారత్ 2.0 పథకంలో భాగంగా కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ.10 కోట్ల మంజూరుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారన్నారు.కొండపల్లి వాసుల కల అయిన నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం త్వరలోనే సాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మైలవరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల), మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కొండపల్లి టిడిపి ప్రెసిడెంట్ బాలాజీ, గొల్లపూడి సీనియర్ నాయకులు వడ్లమూడి చలపతిరావు, జాలిపర్తి గోపాలకృష్ణా, రాయనపాడు నాయకులు కాటంనేని పూర్ణచంద్రరావు, శీలంనేని సాంబశివరావు లతో పాటు కొండపల్లి కౌన్సిలర్లు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆవకాయ అమరావతికి తొలగిన అడ్డంకులు

(మొదటిపేజీ తరువాయి)



ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అమరావతి బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఆవకాయ అమరావతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అయితే కార్యక్రమం పున్నమిఘాట్ లో నిర్వహిస్తుండడంతో ప్రైవేట్ స్థల యజమానులు అడ్డం తిరిగారు. దీంతో కలెక్టర్ లక్ష్మీశా జోక్యం చేసుకొని పున్నమి స్థల యజమానులను చర్చలకు పిలిచారు. ప్రతి కార్యక్రమంకు మా స్థలాలు ఇస్తున్నాం కాని మాకు సరైన గౌరవం ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన కలెక్టర్ లిఖిత పూర్వకంగా ఇవ్వాలని చెప్పడంతో స్థల యజమానులు మరోసారి కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని చెప్పడంతో స్థల యజమానులంతా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించిన తీరును కొనియాడారు.

**బబ్బూరి గ్రౌండ్స్ లో ఈ నెల 11 నుంచి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం**

ఈ నెల 11 వ తేదీనుంచి బబ్బూరి గ్రౌండ్స్ లో ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభంకానుంది. ఆవకాయ అమరావతి పున్నమిలో పెడుతున్న తరుణంలో మొదట్లో ఎగ్జిబిషన్ అడ్డంకిగా ఉందని తొలగించేందుకు అధికారులు సిద్ధమవ్వడంతో ఎగ్జిబిషన్ నిర్వాహకులు కలెక్టర్ లక్ష్మీశా దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ లక్ష్మీశా 30 అడుగులు దూరం వెళ్లాలని, ఆవకాయ అమరావతి కి ప్రజలు పెద్ద సంఖ్య లో వస్తారని కార్యక్రమానికి సహకరించాలని కోరడంతో నిర్వాహకులు వెంటనే స్పందించి 30 అడుగులు ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఆవకాయ అమరావతికి సహకరిస్తామని కలెక్టర్ కు చెప్పడంతో ఈ నెల 11 నుంచి బబ్బూరి గ్రౌండ్స్ లో ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# అభివృద్ధికి కేరాఫ్‌గా మచిలీపట్నాన్ని మారుస్తా..



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధికి రోల్ మోడల్గా తీర్చిదిద్దుతానని,ప్రతి రోడ్డును అభివృద్ధి చేసి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాప్రయోజనం కోసం పని చేస్తానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డితో కలిసిరూ.33 కోట్ల వ్యయంతో చేపట్టిన కమ్మవారిచెరువు - చిన్నాపురం రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.6 కోట్లతో కాలేఖాన్ పేట -చిన్నాపురం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.తొలిసారిగా మచిలీపట్నం విచ్చేసిన మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి నేపథ్యంలో చిన్నాపురం ప్రజలు గంగిరెద్దులతో ఆత్మీయ స్వాగతం పలికారు. చిన్నాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామవారిని దర్శించుకున్నారు. చిన్నాపురంలో సభావేధిక వద్దకు గంగిరెద్దుల ఊరేగింపు, మేళతాళాలతో పాదయాత్రగా చేరుకున్నారు.మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనల ద్వారా ముందే సంక్రాంతి వచ్చింది.విజయవాడ మచిలీపట్నం రోడ్డు విస్తర కోసం గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలంతా వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించాం.తర్వాత కత్తిపూడి ఒంగోలు రోడ్డు పామర్రు మీదుగా డిజైన్ చేస్తే. దాన్ని మచిలీపట్నం సమీపం నుండి వెళ్లేలా పోరాడి సాధించాం.చిన్నాపురం పరిసర ప్రాంత ప్రజలు రోడ్డు సరిగా లేక అవస్థలు పడుతుంటే.2014-19 మధ్య కూటమి ప్రభుత్వమే సాకారం చేసింది. గుండేరుపై వంతెన నిర్మించాం. ఊరు పెరుగుతోంది.రవాణా పెరుగుతోందని భావించి చిన్నాపురం నుండీ శారదానగర్ వరకు రోడ్డును రెండు వరుసలుగా అభివృద్ధి చేశాం. కోడూరు వద్ద వంతెన నిర్మించిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదే. తర్వాత వచ్చిన పాలకులు అభివృద్ధిని గాలికి వదిలేశారు.

గత ఐదేళ్లు రోడ్లపై గుంతలు పూడ్చే దిక్కు కూడా లేని పరిస్థితి నెలకొంది. కానీ నేడు సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలన్నీ పూడ్చాలని లక్ష్యం పెట్టుకుని మరీ పనులు చేస్తున్నాం.ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.46 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసుకున్నాం. తీర ప్రాంతంలో లోసరి నుండి మంగినపూడి, గిలకలదిండి, పోలాటితిప్ప, కోడూరు మీదుగా నిజాంపట్నం వరకు 136 కిమీల రోడ్డు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధ చేస్తున్నాం. ఆ రోడ్డు పూర్తి చేసుకుం పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ, రేపల్లె నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల దశ దిశ పూర్తిగా మార్చేయగలుగుతాం.

తీర ప్రాంతంలోని రోడ్డు నిర్మాణం పూర్తైతే త్వరలో పూర్తి కాబోతున్న పోర్టు, ఫిషింగ్ హార్బర్, మంగినపూడి బీచ్ డెవలప్మెంట్, సాల్ట్ పరిశ్రమ లాంటి అనేక సంస్థలకు రవాణా సదుపాయం మరింత మెరుగు పడుతుంది. మరోవైపు మచిలీపట్నం - యాదర రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపిచంద్, పిప్పళ్ల వెంకన్న,తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'హర్ ఘర్ యోగా'ను ప్రారంభించిన హాబిల్డ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశ మొట్టమొదటి అలవాటు నిర్మాణ వేదిక (హ్యాబిట్ బిల్డింగ్ ప్లాట్‌ఫామ్) హాబిల్డ్, 21 రోజుల ఉచిత యోగా ప్రయాణం ద్వారా సరళమైన, స్థిరమైన యోగా అలవాటును నిర్మించడం ద్వా రా కొత్త సంవత్సరాన్ని ప్రారంభించాల్సిందిగా వ్యక్తులను ప్రోత్సహిస్తూ, తన ప్రధాన చొరవ అయిన హర్ ఘర్ యోగాను ప్రారంభించి నట్లుగా ప్రకటిం చింది. ఈ సందర్భంగా ఐఐటీ పూర్వ విద్యార్థి, ప్రభుత్వ సర్టిఫైడ్ యోగా నిపు ణుడు, హాబిల్డ్ ప్రతినిధి సౌరభ్ బోత్రా మాట్లాడుతూ చిన్న, పునరావృతమయ్యే చర్యల ద్వారా ఆరోగ్యదాయక అలవాట్లు నిర్మించబడతాయని హర్ ఘర్ యోగా న మ్ముతోందన్నారు. అందుకే, అన్ని వయస్సుల వారిని కూడా లింగ భేదం లేకుండా, అన్ని ప్రాంతాల్లో కూడా ఎలాంటి ఒత్తిడి, పరిపూర్ణత ఆవశ్య కత లేదా ఖరీదైన సెటప్ అవసరం లేకుండా తమ యోగా ప్రయాణాన్ని ప్రారం భించడానికి లేదా పునఃప్రారంభించడానికి ప్రోత్సహిస్తోందన్నారు. లక్ష లాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటుండటంతో, ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గా ల ప్రజలకు ఆరోగ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం, స్థిరంగా ఉంచడం అనే తన లక్ష్యాన్ని హాబిల్డ్ కొనసాగిస్తోందన్నారు. హర్ ఘర్ యోగా చొరవ డిజి టల్ ఫస్ట్, పెద్ద స్థాయి కార్యక్రమంగా రూపొందించబడిందన్నారు. వ్యక్తులు యోగాను ఒకేసారి చేసుకునే తీర్మానం లేదా కాలానుగుణ కార్యకలా పంగా పరిగణించకుండా వారి దినచర్యలో పొందుపరచడంలో సహాయపడటంపై దృ ష్టి సారించిందన్నారు. సంప్రదాయ ఫిట్‌నెస్ సవాళ్ల మాదిరిగా కాకుండా, హర్ ఘర్ యోగా యోగాను కేవలం వ్యాయామంగా కాకుండా మానసిక, శారీరక శ్రేయస్సు కోసం రోజువారీ అలవాటుగా పరిగణిస్తుందని చెప్పారు. ఈ చొరవ యొక్క ప్రధాన అంశం యూట్యూబ్ లో రోజువారీ ప్రత్యక్ష, ఆన్‌లైన్ యోగా సె షన్లు. ఇవి ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి మద్దతును, నిర్మాణాన్ని అంది స్తాయి, పాల్గొనేవారు స్థిరత్వాన్ని పెంపొందించుకోవడానికి, యోగాను వారి రో జువారీ దిన చర్యలో సజావుగా సమగ్రపరచడానికి సహాయ పడతా యన్నారు. 21 రోజుల ఉచిత యోగా ప్రయాణం కోసం రిజిస్ట్రేషన్లు ఇ ప్పుడు ప్రారంభమ య్యాయని, https://habit.yoga/ను సంప్రదించాల్సిందిగా కోరారు.

# విభిన్నమైన వంటకాలతో మాస్టర్ చెఫ్ పోటీల్లో నారాయణ విద్యార్థులు




**గన్నవరం, జనవరి 7, మేజర్ న్యూస్ :** గన్నవరం విద్యానగం లో నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం ఒకటవ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు "మాస్టర్ చెఫ్ " పోటీ నిర్వహించడం జరిగింది. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత, పాక నైపు ణ్యాలను ప్రదర్శించి ఎన్నో రకాల వంటకాలను తయారు చేసుకుని పాఠశాలకు తీసుకొని వచ్చారు. విభిన్నమైన వంటకాలు క్యారెట్, బీట్రూట్ తో రకరకాల వంటకాలు, మంచూరియా, బ్రెడ్ హల్వా, కొబ్బరి ఉండలు, ఫిష్ ఫ్రై, బిరియాని. మొదలైన ఎన్నో రకాల నోరూరించే వంటకాలను తల్లిదండ్రుల సహకారాలు తీసుకొని వచ్చారు. విద్యార్థులకు సహాయ సహకారాలు అందించిన తల్లిదండ్రులను పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మస్తాన్ భాషా, పాఠశాల ఏ జీ ఎం సత్తి రెడ్డి ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### డిజిటల్ గ్రీన్ సిస్కో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సహకారంతో..

# ఆంధ్రప్రదేశ్‌లో రైతుల కోసం కొత్త ఏఐ ఆధారిత సలహా సేవలు ప్రారంభం

**గుంటూరు, జనవరి 7, మేజర్ న్యూస్ :** టెక్నాలజీ, డేటా ద్వారా భారతదేశం లోని చిన్న, సన్నకారు రైతులను శక్తివంతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానవన శాఖ సహకారంతో, సామాజిక ప్రభావ సంస్థ డిజిటల్ గ్రీన్, సిస్కో ఇండియా మద్దతుతో రైతుల ఆదాయాలను మెరుగుపరిచేలా ఏఐ ఆధారిత, సమయోచితమైన, ప్రాసంగికమైన వాతావరణానికి అనుకూలమైన (క్లైమేట్-స్మార్ట్) సలహాలను అందించే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఏఐ ఆధారిత సలహాల ద్వారా చిన్న, సన్నకారు రైతుల ఆదాయాల పెంపు అనే పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం, చిన్న, సన్నకారు రైతులకు ఏఐ సహాయంతో స్థానికీకరించిన వ్యవసాయ సలహా సేవలను విస్తృతంగా అందుబాటు లోకి తీసుకురావడంలో ఒక కీలకమైన ముందడుగుగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, చుట్టగుంటలోని కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమల డైరెక్టర్ డా. కె. శ్రీనివాసులు ఈ రోజు అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్‌లో ప్రధానంగా ఫార్మర్‌చాట్ అనే ఏఐ ఆధారిత, బహుమాధ్యమ (మల్టీమోడల్) మొబైల్ అప్లికేషన్ ఉంటుంది. ఇది డిజిటల్ గ్రీన్ ద్వారా అభివృద్ధి చేయబడినది, రైతులకు వాతావరణానికి అనుగుణమైన, అత్యంత స్థానిక (హైపర్‌లోకల్), బహుభాషా వ్యవసాయ సలహాలను అందిస్తుంది. ప్రాజెక్ట్ ప్రారంభ సందర్భంగా డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ, "ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ అంతటా ఉన్న సన్నకారు రైతులకు, చిన్నతరహా ఉద్యానవన రైతులకు అర్థవంతమైన ప్రయోజనాలను అందిస్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది. ఫార్మర్‌చాట్ అనువర్తనాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా, అలాగే భాగస్వాముల మధ్య బలమైన సహకారం ద్వారా, ముఖ్యమైన ఉద్యాన పంటల దిగుబడి, నాణ్యతలో స్పష్టమైన మెరుగుదలలను సాధిస్తాము. శాఖకు, రైతు సమాజానికి రెండింటికీ లాభదాయకమైన ఫలితాలు సాధించేందుకు మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేయడం కూడా అంతే కీలకం. వాస్తవికంగా క్షేత్రస్థాయిలో ప్రభావం చూపేందుకు, అలాగే రాష్ట్ర ఉద్యానవన వ్యవస్థను మరింత బలోపేతం చేయేందుకు నిరంతర మద్దతు, క్రమమైన సమీక్షలకు మేము పూర్తిగా కట్టుబడి ఉన్నాము." అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 50,000 మంది రైతులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు (25,000 మందిని ప్రత్యక్షంగా నమోదు చేయడం ద్వారా, మరో 25,000 మందిని డిజిటల్ మార్గాల ద్వారా), ఇందులో కనీసం 60% మహిళా రైతుల భాగస్వామ్యం ఉండేలా చూడనున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలు, గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, సత్యసాయిలో అమలవుతుంది. ఈ కార్యక్రమం కింద, రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రారంభ వర్క్‌షాప్‌లలో ప్రభుత్వ అధికారులు, ముఖ్య భాగస్వాములకు ప్రాజెక్ట్ లక్ష్యాలు, అమలు ప్రణాళికపై అవగాహన కల్పించ




బడుతుంది. అదనంగా, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ సహా వివిధ ప్రభుత్వ సంస్థల నుండి 300 మంది ఫ్రంట్‌లైన్ ఎక్స్‌టెన్షన్ వర్కర్లు, అలాగే ఐదు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, వారి ప్రతినిధులకు ఫార్మర్‌చాట్ ను సమర్థవంతంగా ఉపయోగించేందుకు శిక్షణ ఇవ్వబడుతుంది. అనంతరం, ఈ ఫ్రంట్‌లైన్ ఎక్స్‌టెన్షన్ వర్కర్లు, రైతులను నేరుగా అప్లికేషన్‌లో నమోదు చేసి, ఫార్మర్‌చాట్ వినియోగం, ఫీచర్ల గురించి పరిచయం చేస్తారు. రైతులను సోషల్ మీడియా వేదికలపై డిజిటల్ మార్కెటింగ్ ప్రచారాల ద్వారా కూడా నమోదు చేయనున్నారు. ప్రాజెక్ట్ లక్ష్యాలు సఫలీకృతమ వుతున్నాయో లేదో నిర్ధారించేందుకు ప్రభుత్వ అధికారులు, రైతుల నుండి అభిప్రాయాలను సేకరించేందుకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించబడతాయి. ఈ కార్యక్రమం ద్వారా కనీసం 25% మంది రైతులు అప్లికేషన్‌లో సూచించిన మెరుగైన వ్యవసాయ పద్ధతులను స్వీకరించడంతో పాటు, సక్రియంగా ఉపయోగించే రైతుల్లో 30% మంది మూడు సంవత్సరాల వ్యవధిలో గృహ ఆదాయంలో 20% పెరుగుదల సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. ఫార్మర్‌చాట్ వాస్తవ జీవిత పరిమితులను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడింది తక్కువ అక్షరాస్యత, వ్యక్తిగతీకరించిన, కార్యాచరణాత్మక సమాచారం లోపం, అలాగే వ్యవసాయ నిర్ణయాలు సమయానికి తీసుకోవాల్సిన అవసరం వంటి సవాళ్లను ఇది పరిష్కరిస్తుంది. దీర్ఘకాలంగా ఉన్న సమాచార లోటును తగ్గిస్తూ, ఇది తక్కువ ఖర్చుతో, పెద్ద స్థాయిలో సందర్భానుసారమైన, తక్షణ సలహాలను అందిస్తుంది. ఈ అప్లికేషన్ పంట నిర్వహణపై అనుకూల సలహాలను అందించడమే కాకుండా, ఫార్మర్‌చాట్ లో అప్‌లోడ్ చేసిన ఫోటోల ద్వారా పురుగులు, రోగాలను గుర్తించే సదుపాయాన్ని కూడా కలిగి ఉంది. క్యాలెండర్, రిమైండర్ ఫీచర్లు రైతులకు సీజనల్ పనులపై సమయానుకూల నోటిఫికేషన్లు అందిస్తాయి, అలాగే వారి పురోగతిని ట్రాక్ చేసి, తదుపరి సీజన్‌కు వ్యక్తిగత మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి.



## వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న మార్వాడీ విశ్వవిద్యాలయం

**విజయవాడ మేజర్ న్యూస్ :** వైబ్రెంట్ గుజరాత్ కార్యక్రమం సాధించిన విజయపు స్ఫూర్తితో, మార్వాడీ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకమైన వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సులకు (విజిఆర్సి) ఆతిథ్య వేదికగా నిలవనుంది. గుజరాత్ ప్రభుత్వం నిర్వహించనున్న ఈ సదస్సు ఈ నెల 11 నుండి 12 వరకు జరగనుంది. సౌరాష్ట్రతో పాటు గుజరాత్ రాష్ట్రాన్ని మొత్తంగా విద్యా రంగంలో ప్రపంచ స్థాయిలో నిలపడమే లక్ష్యంగా, ఈ విశ్వవిద్యాలయం గుజరాత్ ప్రభుత్వ విద్యా విభాగానికి రూ. 1,000 కోట్ల పెట్టుబడికి సంబంధించిన అవగాహన ఒప్పంద ప్రతిపాదనను సమర్పించింది. ఈ ప్రతిపాదిత పెట్టుబడి అత్యాధునిక ప్రయోగశాలలతో కూడిన కొత్త విద్యా భవనాలు, ఆధునిక క్రీడా సౌకర్యాలు, నూతన తరం హాస్టళ్లతో సహా అత్యాధునిక విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ సందర్భంగా మార్వాడీ విశ్వవిద్యాలయం ట్రస్టీ ధ్రువ్ మార్వాడీ మాట్లాడుతూ, గుజరాత్ అభివృద్ధికి తోడ్పడటంతో పాటుగా వికసిత భారత్ లక్ష్యానికి తోడ్పడాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

## రియల్‌మీ 16 ప్రో సిరీస్ ఆవిష్కరణ




**విశాఖపట్నం, జనవరి 8, మేజర్ న్యూస్ :** రియల్‌మీ, భారతీయ యువతలో చాలా ప్రసిద్ధమైన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్, ఈ రోజు ఎంతో ఎదురుచూసిన రియల్‌మీ 16 ప్రో సిరీస్ను విడుదల చేసింది. ఈ సిరీస్‌తో ప్రీమియం మిడ్-రేంజ్ ఫోన్‌లలో మూల్యనిర్ణయమైన స్థానం పొందినట్లు నిలిచింది. ఫ్లాగ్‌షిప్-స్థాయి రియల్ మీ 16 ప్రో+ అందుబాటులో ఉండే అన్ని విధాలుగా ఉపయోగకరమైన రియల్ మీ 16 ప్రోతో ఈ సిరీస్ పనితీరు, డిజైన్‌లో నైపుణ్యంతో రూపొందించిన అత్యుత్తమతను పెంచుతుంది,, పోర్ట్రైట్ ఇమేజింగ్ ప్రమాణాలను కొత్త విధంగా నిర్వచించడంపై ప్రత్యేక దృష్టిని కలిగి ఉంది. 200ఎంపీ పోర్ట్రైట్ మాస్టర్: ప్రతి భావాన్ని క్యాప్చర్ చేయండి. రియల్‌మీ 16 ప్రో సిరీస్ ప్రీమియం మిడ్-రేంజ్ విభాగంలో 200ఎంపీ పోర్ట్రైట్ మాస్టర్‌గా తన స్థానాన్ని స్థాపిస్తుంది, ఫ్లాగ్‌షిప్ స్థాయి ఇమేజింగ్ హార్డ్‌వేర్‌ను స్మార్ట్ సాఫ్ట్‌వేర్‌తో కలిపి పోర్ట్రైట్ ఫోటోగ్రఫీని కొత్తగా నిర్వచిస్తుంది. రెండు మోడల్స్ కూడా ప్రతి మూడ్, మూమెంట్ను ఖచ్చితంగా కాప్చర్ చేయడానికి ప్రొఫెషనల్ టూల్స్ అందిస్తాయి, ఫ్లాగ్‌షిప్-స్థాయి రియల్ మీ 16 ప్రో+ ప్రత్యేక అప్‌గ్రేడ్లతో సృజనాత్మక వ్యక్తీకరణను మరింత పెంచుతూ ముందుంటుంది.

## పెద్దఅవుటపల్లిలో సెయింట్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలు



**గన్నవరం (ఉంగుటూరు), జనవరి 7, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెద్ద అవుటపల్లిలో సెయింట్ జోసఫ్ తంబి 81వ వర్ధంతి మహోత్సవాలు జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు హాజరు కావాల్సిందిగా గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావును పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల విశిష్టత, భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా ఫాదర్ జోసెఫ్ వివరించారు. ప్రతి ఏటా ఈ వర్ధంతి మహోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారని, ఈ ఏడాది కూడా వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల పార్టీ అధ్యక్షులు కొలుసు రవీంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖర్, రెబ్బా తంబి తదితరులు పాల్గొన్నారు.



## సంక్రాంతి ముందే కోడి పందాలకు కట్టడి

### వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసరావు హెచ్చరికలు

**హనుమాన్ జంక్షన్, జనవరి 7, మేజర్ న్యూస్ :** రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని బాపులపాడు మండల పరిధిలో కోడి పందాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వీరవల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిప్పనగుంట, ఎ. సీతారాంపురం గ్రామాలలో గతంలో కోడి పందాలు నిర్వహించబడిన ప్రాంతాలను బుధవారం సందర్శించారు. పండుగల సమయంలో అక్రమ కార్యకలాపాలకు తావులేకుండా ఉండాలనే ఉద్దేశంతో, కోడి పందాలకు వ్యతిరేకంగా హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. కోడి పందాలు చట్ట విరుద్ధమని, వాటిని నిర్వహించినా లేదా పాల్గొన్నా కఠిన చర్యలు తప్పవని ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. సంక్రాంతి పండుగను శాంతియుతంగా, సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. కోడి పందాలపై పోలీస్ శాఖ నిరంతర నిఘా కొనసాగిస్తుందని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

## కోడి పందాలు, జూదం కార్యకలాపాలపై కఠిన చర్యలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంలో మండల పరిధిలో కోడి పందేలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలకు సిద్ధంగా ఉందని మండల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కోడి పందేలు నిర్వహించిన వారిపైనా, వాటిలో పాల్గొన్న వారిపైనా చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ బి. లోకరాజు, ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్, ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ లు హెచ్చరిం చారు. అక్రమ జూద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, ఆకస్మిక దాడులు నిర్వహించడం, సంబంధిత పరికరాలను స్వాధీనం చేసుకోవడం, అరెస్టులు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. జూదానికి సంబంధించిన సమాచారం అందించిన ప్రజల వివరాలను గోప్యంగా ఉంచుతామని కూడా తెలియజేశారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో జూదం ఆడటం నేరమని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించడం జరిగింది. ఈ అంశంపై ఎంపిడిఓ, తహసీల్దార్, గుడ్లవల్లేరు ఎస్ఐ లు సంయుక్తంగా గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి, పోలీస్రెవెన్యూపంచాయతీ శాఖల సమన్వయంతో కఠిన చర్యలు అమలు చేయాలని నిర్ణయించారు. సంక్రాంతి పండుగను శాంతియుతంగా, చట్టబద్ధంగా జరుపుకోవాలని ప్రజలకు ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పెదమద్దాలిలో కోడిపందాలు వద్దంటూ ర్యాలీ



**పామర్రు మేజర్ న్యూస్:** రాబోయే సంక్రాంతికి కోడి పందాలు, పేకాటలు ఆడవద్దని కోరుతూ మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలో పోలీసులు అవగాహనను కల్పించారు. పామర్రు ఎస్సై వి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. కోడిపందాలు, జూదం బదులుగా గ్రామాలలో సాంప్రదాయ క్రీడలు నిర్వహించుకుని కుటుంబాలు సంతోషంగా ఉండాలని సూచించారు. జూద క్రీడలు నిర్వహిస్తే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు.

# కోడి పందేల, జూద క్రీడల, క్యాసినో, అక్రమ మద్యం నిర్వాహకులకు హెచ్చరిక





**నాగాయలంక జనవరి 7 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం లోని తహసీల్దార్ వారి కార్యాలయంలో తహసీల్దార్ ఎంపీడీవో స్టేషన్ హౌస్ ఆఫీసర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఈవోపీఆర్డి అధికారులతో మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయడమైనదని నాగాయలంక మండల మండల రెవెన్యూ అధికారి సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పత్రికా ప్రకటన విడుదల చేసినారు. కృష్ణాజిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వారి ప్రొసీడింగ్స్ నెంబర్ ప్రకారం సంక్రాంతి పండుగ సీజన్లో 2026 సమయంలో కోడిపందాలు,నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపైన బుధవారం ఉదయం 11 గంటలకు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినారు ముందస్తు చర్యలో భాగంగా గతంలో నిర్వహించు చున్న వ్యక్తులపై బైండవర్ కేసులు నమోదు చేసి ఉన్నారు. కోడిపందాలను నివారించడానికి ప్రభుత్వం మెమో నెంబర్ 12125/ జనరల్ బి 2016 తేదీ 4/1/2018 ద్వారా ఆదేశాలను జారీ చేసింది. గౌరవనీయ హైకోర్టు ఆదేశాలు అమలు చేయకపోతే కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు అవుతుందని సూచించారు.జంతువుల పట్ల క్రూరత్వాన్ని నివారించే చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం 1974 నిబంధనల ప్రకారం కోడి పందాలను నిర్వహించడం శిక్షారసమైన ఎరమని సాధారణ ప్రజలలో అవగాహన కల్పించడానికి మండల స్థాయి, గ్రామస్థాయిలు కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయని వాలీబాల్ కబడ్డీ రంగోలి, ఇతర పోటీల వంటి ప్రత్యేక అవగాహన కల్పించడం ఈ కమిటీల ప్రత్యేక బాధ్యత గ్రామస్థాయి కమిటీలు గ్రామ రెవెన్యూ అధికారి పంచాయతీ కార్యదర్శి ఇద్దరు కానిస్టేబుళ్లు గ్రామ రెవెన్యూ అధికారులు గ్రేడ్ 1&2, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 5 ఉంటారు తన పరిధిలోని కోడి పందాలు జరుగుతున్నట్లు గమనించిన వెంటనే ఎటువంటి ఆలస్యం లేకుండా ఆ విషయాన్ని మండల స్థాయి కమిటీ దృష్టికి తీసుకురావాలని గ్రామస్థాయి కమిటీకి సూచించడం జరిగినది. అనంతరం ఒక్కపట్లవారిపాలెం గ్రామపంచాయతీ దగ్గర మండల స్థాయి కమిటీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగాయలంక తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ 2025 సమయములో తమ పరిధిలో గణనీయమైన సంఖ్యలో కేసులు నమోదు చేశామని తెలిపారు కోడి కాళ్లకు కత్తులు కట్టే పాత నేరస్తులను, నిర్వహణను స్థల యజమానులపై ప్రోత్సాహించే పందెపరా యుళ్లపై బైండోవర్ కేసులు నమోదు చేసి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేసినారు గతంలో రాష్ట్రవ్యాప్తంగా పందెంలో పాల్గొనే వారిపై అనేక కేసులను నమోదు చేయబడ్డాయి వారు ఇప్పటికీ ఎప్పటికప్పుడు కోర్టులకు హాజరు కావాల్సి వస్తుంది కాబట్టి 2026 సంక్రాంతి పండుగ సీజన్లో కోడి పందాలు జూదాలు క్యాసినోలు అక్రమ మద్యం అమ్మకాలు మొదలైన సామాజిక దురాచారాలను అరికట్టడానికి రెవెన్యూ పోలీస్, ఇతర సంబంధిత శాఖలన్నీ తమ వ్యక్తిగత శ్రద్ధ వహించాలని కోరారు.

# కోడిపందాలు నిర్వహించడం, పాల్గొనడం నేరం



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** కోడి పందాలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరం అని, అలా జరగకుండా ఉండే విధంగా ముందస్తుగా గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని పెదపారుపూడి ఇంచార్జి ఎంపీడీఓ విజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం సంబంధిత మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలోనూ గ్రామ సభలు నిర్వహించి కోడిపందాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించి తీర్మానాలు చేయాలని కోరారు. స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పండుగ సందర్భంలో గేమింగ్, కోడి పందాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, ఈ విషయంలో గతంలో గుర్తించిన వారిపై నిఘా ఉంటుందని, గ్రామాలలో ఆ ఛాయలు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కోడి పందెముల నిషేధం పై వచ్చిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశం లో డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్, వెటరినరీ అసిస్టెంట్ సర్జన్స్ డా. రామలక్ష్మి, డా. వనిత, అన్ని పంచాయితీల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు



**మొవ్వ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మండలంలో సహకార పరపతి సంఘం ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. కేడీసీసీ బ్యాంక్ మొవ్వ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షకు కోసూరు పిఏసిఎస్ విశ్రాంత సీఇఓ ఏనుగు. శ్రీనివాసరావు, సిఐటియు కృష్ణాజిల్లా మాజీ సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు లు ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శీలం.నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల రోజుల నుంచి రాష్ట్రంలో ఉన్న సహకార సంఘాలు ఉద్యోగులు వేలాదిమంది వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నప్పటికి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని ఇప్పటికైనా సంబంధిత మంత్రి, అధికారులు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, తక్షణం సహకార సంఘాల ఉద్యోగుల యొక్క న్యాయమైన సమస్యలను పరిష్కార దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార పరపతి సంఘాల ఉద్యోగులు జేఏసీ నేతలు పింగళి. వెంకటరమణారావు, జొన్నలగడ్డ. సత్యనారాయణ, వడ్డే. జగదీశ్వరావు, రాజులపాటి. సోమేశ్వరావు, ధోనే. రాజేష్, కిషోర్, జే. కృష్ణ సౌజన్య, తాతా. కృష్ణకుమారి, ప్రవల్లిక, శిరీష, మాధవి, మహిత, అనూష, వాసు, ఫణి కుమార్ తదితర ఉద్యోగులు దీక్షలో పాల్గొని జీ.ఓ నెంబర్ 36 ఆమలు పరిచి 2019, 2024 పెండింగ్ లో ఉన్న వేతన సవరణలు చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని గ్యాడ్యూటీ సీలింగ్ లో రెండు లక్షల మాత్రమే చెల్లిస్తున్నారు గ్యాడ్యూటీ చట్టాన్ని అమలుపరచి చట్టం ప్రకారం గ్యాడ్యూటీ చెల్లించాలని, ఉద్యోగులకు ఐదు లక్షల తక్కువ కాకుండా ఆరోగ్య బీమాను కల్పించి ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటుంబానికి ఆధారము లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి 50 లక్షలు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని రిటైర్మెంట్ వయసు ప్రభుత్వం ఉద్యోగులకు అమలయ్యే 62 సంవత్సరాలకు పెంచాలి, ఉద్యోగుల జీత భత్యాలను డ్యూ టు పద్దులను రద్దు చేయాలి, 2019లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి వారికి కూడా జీ వో నెంబర్ 36 ను అమలుపరచి డి సి సి బి ల ద్వారా కాకుండా రైతులకు డైరెక్ట్ గా ఋణాలు పిఏసిఎస్ ల సంఘాల ద్వారా అందే విధంగా చర్యలు తీసుకోవాలని, సంఘాలు చెల్లించిన షేర్ దనం పై కనీసం ఆరు శాతం డివిడెంట్ లేదా వడ్డీ చెల్లించాలని, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ క్లర్క్ లేదా కంప్యూటర్ ఆపరేటర్లను సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న సీఇఓ పోస్టులను వీరితో భర్తీ చేయాలని, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డి ఎల్ ఇ సి ద్వారా రిక్రూట్మెంట్ జరపాలని డిమాండ్ చేశారు.

# సమిష్టి కృషితో సమస్యలను పరిష్కరించుకుందాం..



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** ప్రభుత్వం, అధికారులు, ప్రజలు, అందరి సమిష్టి కృషితో గుడివాడ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం పర్యటించారు. ముందుగా మండల జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్లో కూరాడ పరిసర గ్రామస్తులు తమ సమస్యల అర్జీలను ఎమ్మెల్యే రాముకు అందజేశారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే రాము, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. అర్జీలు అందించిన ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ప్రజలతో ఎమ్మెల్యే రాము అన్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో రైతాంగ సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యే రాముకు తెలిపారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. వ్యాగన్లు పెట్టించి పక్క జిల్లాల్లో దాన్యం కొనుగోలు చేయించి గిట్టుబాటు ధర కల్పించిన ఎమ్మెల్యే రాముకు సమావేశంలో పాల్గొన్న పలువురు రైతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజా దర్బార్లో అందించిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు.ప్రభుత్వ పాలసీ పర సమస్యలు, ఆర్థికపర సమస్యల పరిష్కారం కొంత ఆలస్యం అవుతుందని కానీ పరిష్కరించడం మాత్రం పక్కా అని ఆయన అన్నారు. తుఫాను వచ్చినప్పుడు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటినుంచే ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. ఇప్పటికే కూటమి పద్దెనిమిది నెలల పాలనలో మండలంలోనీ ఇరిగేషన్ కాలువలు, డ్రైన్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుత సీజన్లో ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని రాబోవు సీజన్లో డ్రైయర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ 18 నెలల పాలనలో గుడ్లవల్లేరు మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను పూర్తి చేసామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి మండలంలో జరుగుతుందని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సాయన పుష్పవతి, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి కుమార్, గ్రామ టిడిపి అధ్యక్షులు వల్లభనేని రంగబాబు, పిఏసిఎస్ అధ్యక్షులు యెనిగళ్ళ నాగేశ్వరరావు, కూటమి నాయకులు వల్లూరిపల్లి వెంకటేశ్వరరావు, పామర్తి సత్తిబాబు,పెన్నేరు రమేష్ బాబు, పోలవరపు వెంకట్రావు, కాగిత నరేంద్ర,బొర్ర నాగేశ్వరావు, తోట మల్లి, మల్ల రామారావు, సాయి, శివ, ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్, తహశీల్దార్ బి. లోకరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ రూపేష్, ఎంఈఓ లు జగన్మోహన్రావు, గోపాలరావు, పంచాయతీ ఏఇ నాగేశ్వరరావు, ఎపిఓ స్ఫూర్తి, ఎలక్ట్రికల్ ఏఈ శ్యామల, ఇరిగేషన్ ఏఇ నిర్మల జ్యోతి కూరాడ గ్రామ నాయకులు కళ్యాణపు నవాబు, శీరం రమేష్, మాదాసు ప్రసాద్,పులి ప్రసాద్, బాసా రాంబాబు, బొర్రా నాగేశ్వరరావు, చిలంకుర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల అభివృద్ధికి చర్యలు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని కుంటముక్కల గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్‌తో కలసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం కుంటముక్కల గ్రామంలోని గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పేద బాలికలు చదువుకునే ఈ గురుకుల పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేవన్నారు. ఇటీవల ఆకస్మిక తనిఖీలలో ఈ విషయం గుర్తించినట్లు పేర్కొన్నారు.ఇక్కడి బాలికలు ఎంతో ప్రతిభను ప్రదర్శిస్తూ పట్టుదలతో బాగా చదువుకుంటున్నారని వారికి మెరుగైన సౌకర్యాలు, సరైన వసతులు కల్పిస్తే వారు మరింత ప్రతిభావంతంగా రాణించే అవకాశం ఉందన్నారు. అందుకే ఈ పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.ఈ గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.4 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డార్మిటరీ, టాయిలెట్స్ సౌకర్యం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా విద్యార్థినులకు ఇప్పటికే క్రీడా సామాగ్రిని అందజేశామన్నారు. మైదానం కూడా చదును చేసి పిల్లలు ఆడుకోవడానికి అనువుగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## పులిగడ్డలో జంగిల్ క్లియరెన్స్

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ సుందరీకరణలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్టు సర్పంచ్ డాక్టర్ దాసరి విజయ్ కుమార్ తెలిపారు. పులిగడ్డ జంక్షన్ నుండి అవనిగడ్డ ప్రధాన రహదారి వెంబడి భారతి హాస్పిటల్ వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలను తొలగిస్తూ జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా వాహనదారులకు ఇబ్బంది లేకుండా జెసిబి ద్వారా పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ ఈవో బి.అనిత,ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రభు ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్,చెన్ను కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో మెగాకంటి పరీక్ష, రక్తదాన శిబిరం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జనవరి 07 :** విద్యా ర్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆరోగ్య సంక్షేమా న్ని దృష్టిలో ఉంచుకుని ఎఎఎన్ఎమ్ అండ్ వివి ఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్, గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన, కం టి పరీక్ష శిబిరావను బుధవారం ఏర్పాటు చేసారు. ఈ రక్తదాన, కంటి పరీక్ష శిభిరాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వి.వి.పి. ఎస్. ఆంజనేయులు ప్రారంభించగా 4 వేల మంది విద్యార్థులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అలాగే నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో, ప్రముఖ వైద్యులు, వైద్య సిబ్బంది సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ “ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన సంపద. ఇటువంటి శిబిరాలు విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు సమాజానికి సేవ చేయాలనే భావనను పెంపొందిస్తాయి” అని అన్నారు. ఈ సందర్భం గా ఈ శిబిరం ప్రారంభోత్సవానికి విచ్చేసిన గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లయన్ వై.పి.సి.ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ముఖ్య అతిధి లయన్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు దుశ్శాలువతో సన్మానించారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచిత వైద్య సలహాలు అందించడంతో పాటు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో డా.వై.జగన్మోహనరావు మెమోరియల్ చైల్డ్ ఐ కేర్ లయన్స్ డిస్ట్రిక్ట్ సర్వీస్ ట్రస్ట్ వారిచే 4 వేలమంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 250 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నాయని గుర్తించారు. వారికి ఉచితంగా కళ్లజోళ్లను కూడా అందజేస్తారు. అలాగే 151 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా భావాన్ని చాటుకున్నారు. ఆంధ్ర ల యన్స్ బ్లడ్ బ్యాంకు, ఆంధ్ర హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి 76 మంది, చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లయన్స్ డిస్ట్రిక్ట్ 316డి బ్లడ్ బ్యాంక్ వారికి 75 మంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు, ప్రెసిడెంట్ మేరుగు పెరుమాళ్ళు, సెక్రటరీ కె.నవాబు, ట్రెజరర్ పి.చిట్టిబాబు, మాజీ గవర్నర్ హ వై.పి.సి.ప్రసాద్, ప్రాంతీయ అధికారి పి.ఎన్.విజయ్ బాబు, వివిధ లయన్స్ క్లబ్ మెంబర్లు, పాలిటెక్నిక్ ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆఫీసర్ పి.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి. రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, అకడమిక్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ జివివి. సత్యనారాయణ, విభాగాధిపతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.

## వత్సవాయి డి పి ఆర్ టి యు డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ



**వత్సవాయి జనవరి 7 మేజర్ న్యూస్ :** వత్సవాయి మండల విద్యాశాఖ అధికారి లాహోరి నాగరాజు డి పి ఆర్ టి యు వత్సవాయి మండల శాఖ తరుపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, వారిచే డీపీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, వాల్ స్టిక్కర్స్, సిఎల్ బుక్ ఆవిష్కరింప చేశారు. శాఖ తరపున డైరీ, క్యాలెండర్, వాల్ స్టిక్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్టీయూ వత్సవా యి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జే. రవీంద్రనాథ్, ఎస్.కే. జాన్, మండల ఉపాధ్యాయ సేవాదళ్ కార్యదర్శి బి పూర్ణయ్య జిల్లా కార్యదర్శి ఏ వెంకటప్పయ్య రాష్ట్ర కార్యదర్శి వై మల్లేశ్వర పాల్గొని విద్యాశాఖ అధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## 12న కూచిపూడిలో హైందవ సమ్మేళ



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడిలోఈనెల12వతేదీన నిర్వహించే హైందవ సమ్మేళనానికి పెదముత్తేవిలోనిముముక్షుజనమహా పీఠాధిపతి శ్రీముత్తేవిగౌరకృష్ణ గురుదేవులను బుధవారం ఆహ్వానించారు. ఇదే విషయాన్నినిర్వాహకులైన మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి.శివరామయ్య, ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు పేర్కొన్నారు. శ్రీకృష్ణాశ్రమంలో ఆయనను కలిసి హిందూ సమ్మేళనానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ కుల ప్రాంతాలకు అతీతంగా హిందూ ఐక్యత కోసం నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనం కార్యక్రమం ప్రతి హిందువు బంధువు పాల్గొనాలని సూచించారు. మండలంలోని కాజ, కోసూరు, పెదముత్తేవి, కొండవరం, వేములమడ, మొవ్వ పాలెం, మొవ్వ, కొండవరం, కూచిపూడి, పెదపూడి, బార్లపూడి, యద్దనపూడి, అయ్యంకి, పెడసనగల్లు, గూడపాడు, భట్లపెనుమర్రు, గ్రామాల నుంచి గ్రామానికి నలుగురు చొప్పున కార్యక్రమాలకు కార్యకర్తలను ఎంపిక చేసినట్లు వివరించారు. హిందూ సమ్మేళనానికి ముఖ్య వక్తగా ఆంధ్ర ప్రాంత శారీరక ప్రముఖ్ చంద్రశేఖర్ (ఒంగోలు), శ్రీశ్రీశ్రీ కమలానంద స్వామీజీ(భువనేశ్వరపీఠం,గన్నవరం) లను ఆహ్వానించినట్లు తెలిపారు.

## జి.కొండూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరులో పలు అభివృద్ధి పనులకు మైల వరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం శంకుస్థాపన చేశారు. కొత్తూరు రోడ్డులో సచి వాలయం-2 పక్కన15వ ఆర్థికసంఘం నిధులు రూ.36 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణానికి, రూ.20 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. గోకులం షెడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పల్లెపండుగ 2.0 కార్యక్రమం కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమా ణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు అవనిగడ్డలో లలిత కళాష్టావధానము

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సద్గురు త్యాగరాజ స్వామి వారి వర్ధంతి, మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా లలిత కళాష్టావధానము నిర్వహించనున్నట్లు త్యాగరాజ మందిరం నిర్వాహకులు తెలిపారు. స్థానిక త్యాగరాజ మందిరం లో గురువారం సాయంత్రం 4 గంటలకు త్యాగరాజ మందిరం, దివిసీమ సాహితీ సమితి, తెలుగుసావిడి ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ విచ్చేయనున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో అవధాని డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, సంచాలకులు డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, డాక్టర్ గుడి సేవ విష్ణు ప్రసాద్, డాక్టర్ ఎం కృష్ణ కిషోర్, డాక్టర్ అగ్నిహోత్రం పవన్, డాక్టర్ అన్నపురెడ్డి వీర కుమారి, సింహాద్రి పద్మ, జల్లూరి రమాకుమారి, దీవి ఝాన్సీ, డాక్టర్ పూషడపు సుబ్బారావులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం మచిలీపట్నం నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్ల శంకుస్థాపన చేయుటకు విచ్చేసిన రాష్ట్ర భవనాలు పెట్టుబడుల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మచిలీపట్నం ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్‌లో బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు కన్వీనర్ సోడిశెట్టి బాలాజీరావు, కోనపరెడ్డి శ్రీనివాస్,సూరిశెట్టి హరికృష్ణ పలువురు అభినందనలు తెలియజేశారు.

## చలమలశెట్టి చిత్రపటానికి నివాళులర్పించిన బండి




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దివికేగిన మానవతా మూర్తి చలమలశెట్టి శ్రీకృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన బండి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ సమాజ సేవకులు చలమలశెట్టి శ్రీకృష్ణ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ శ్రీకృష్ణ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దశదిన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కొరియర్ శ్రీను, మాదివాడరాము, గడ్డంరాజు,శాయనశివయ్య, త్రిపురారితరుణ్, కొలపల్లి గణేష్, కూనపరెడ్డి ప్రసాద్, నూకల సాయి గణేష్, చలమలశెట్టిరమేష్, దేవ నూరి వీరబాబు,బొమ్మదేవర నరసింహనాయుడు, ఊచచంటి, బండి శివ, తోట రాజేష్, తిరుమలశెట్టినాగరాజు,వాళ్లే రామినాయుడు,తోట భాస్కర్,కర ప ఏసు, మంత్రి పృధ్వి, వడ్డీహరిసాయి, లక్ష్మీపురం ధర్మతేజ పలువురు నగర ప్రముఖులు శ్రీకృష్ణ కుటుంబ సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

## దేశంలో ఎవరైనా రాజ్యాంగానికి బద్ధులమే...

### సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దేశంలో ఎవరైనా రాజ్యాంగానికి బద్ధలై పనిచేయాల్సిందేనని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ యూనిట్ - 1 ఆధ్వర్యంలో బందరు కోట లో నిర్వహిస్తున్న సేవా శిబిరం ఆరో రోజుకు చేరింది. బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సును ఉపకులపతి ఆచార్య కె రాంజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం సంక్రమంగా నడవడానికి రాజ్యాంగంలో నాలుగు వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరిగింది అని ఎవరైనా వాటి పరిధిలో పనిచేయాల్సిందే అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య మాట్లాడుతూ, చదువు ద్వారానే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి ఉన్నప్పుడే ప్రభుత్వాలు బాధ్యతగా పనిచేస్తాయన్నారు. పౌర హక్కులు తెలుసుకోవడం ఎంత అవసరమో విధులు నిర్వర్తించడం కూడా అంతే అవసరమన్నారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డా సల్మా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అజ్మతున్నిసా, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసు సిఐడి కి బదిలీ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** (అవనిగడ్డలో ఐదేళ్ల క్రితం జరిగిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుందని వైసీపీ అభిమాని బడే గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లు గడిచినా నిందితుల అరెస్టు గానీ, చార్జిషీట్ గానీ దాఖలు కాకపోవడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో బడే గౌతమ్ ఆంధ్రప్రదేశ్ డీజీపీ, కృష్ణా జిల్లా ఎస్పీ లకు కేసుపై సమగ్ర విచారణ జరపాలని ది 14/11/2025 న కోరగా, కేసును తాజాగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ, కృష్ణా జిల్లా ఎస్పీ ల ఉత్తర్వుల మేరకు అవనిగడ్డ సీఐ కేసును సీఐడీ కి బదిలీ చేశారని తెలుపుతూ దీనికి సంబంధించి అవనిగడ్డ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె. శ్రీనివాసరావు ద్వారా అధికారిక పత్రము తనకు అందజేసినట్లు గౌతమ్ తెలిపారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులు



### లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు సహాయ సహకారాలు,అభినందనీయం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం లేడీ యాంప్టిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మార్చి 2025 లొ జరిగిన పబ్లిక్ పరీక్షలలొ 9 గ్రూపులలో ప్రతిభ కనబరిచిన 36 మందికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎల్.సత్యనారాయణ కుటుంబ సభ్యులు 30 వేల రూపాయలు ఖరీదు చేసే మిల్టన్ లంచ్ బాక్స్ సెట్లను పెద్దలు లంకిశెట్టి పాండురంగ ప్రసాదరావు, విన్నకోట విద్యా వినోదరావు పేరున అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీ.లక్ష్మి మాట్లాడుతూ స్టూడెంట్స్ ను ప్రోత్సహిస్తూ పది సంవత్సరాల నుండి లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించడం విద్యార్థినిలకు ఎంత ప్రోత్సాహంగా ఉంటుందని అన్నారు. ఆడపిల్లలు చదువుకుని ఎదగాలని భవిష్యత్తులో బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా కళాశాలలో సిమెంట్ బెంచీలు,బార్కెట్లు ఇవ్వటం జరిగిందని తెలియజేశారు. ఇప్పుడు లంకిశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ప్రతిభ కనపర్చిన విద్యార్థినులకు 30000 ఖరీదు చేసే మిల్టన్ లంచ్ బాక్సులు ఇవ్వడం ద్వారా వారి దాతృత్వం తెలియజేస్తుందని అన్నారు.

గత ఏడాది రాష్ట్రంలో రెండో స్థానం పొందిన లేడీ యాంప్టిల్ వచ్చే విద్యా సంవత్సరంలో మొదటి స్థానాన్ని పొందే విధంగా విద్యార్థులు కష్టపడి మంచి మార్కులతో పాస్ కావాలని అన్నారు. నేడు ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫారం మధ్యాహ్నం భోజన పథకం ఎం.సెట్ మెటీరియల్ అందజేస్తున్నదని ఎంతో అర్హత కలిగిన అధ్యాపకులు కళాశాలలో విద్య ని అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరిసెపల్లి పిఎసిఎస్ విశ్రాంత సీఈవో ఎం. వి.వి. రామాంజనేయులు బాబు అధ్యాపకులు సుందరలక్ష్మి,లంకి శెట్టి హరినాధ్ బాబు, మమత, మున్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల తరపున దాత సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఎల్ వంశీకృష్ణను శాలువాలతో సన్మానించారు

# పేద విద్యార్థినికి 15000రూపాయలు మైత్రి ఫౌండేషన్ చేయూత



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జలాల్‌పేటకు చెందిన శవిల్ సంకా శ్రీనివాస్ గుప్తా కృష్ణకుమారి దంపతుల కుమార్తె చిరంజీవి సంకా ఉజ్వల, బాల సాయి డిగ్రీ కాలేజీలో బిసీఎ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్మీడియట్‌లో 920 మార్కులు సాధించిన ప్రతిభావంతమైన విద్యార్థిని అయిన ఉజ్వల,తండ్రి శ్రీనివాస్ గుప్తా మూర్ఛరోగంతో బాధపడుతూ ఆసుపత్రిపాలవడం వల్ల ఏర్పడిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా,ద్వితీయ సంవత్సరం ఫీజు చెల్లించలేని పరిస్థితిని ఎదుర్కొంది. ఫీజు చెల్లించకపోవడంతో ఈ సంవత్సరం జరగబోయే ఫైనల్ పరీక్షలకు కాలేజీ వర్గాలు అనుమతి ఇవ్వలేమని స్పష్టంగా తెలియజేశాయి. ఈ విషయాన్ని మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ దృష్టికి తీసుకురాగా, ఫౌండేషన్ సభ్యులు దీనిని,ప్రవాసాంధ్రులు గౌరవనీయులు చలమలశెట్టి బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన, విద్యార్థినికి అవసరమైన ఫీజు 15000రూపాయిలు మొత్తాన్ని చెల్లించేందుకు మైత్రి ఫౌండేషన్‌కు హామీ ఇచ్చి, బుధవారం తమ తండ్రి కీర్తిశేషులు శ్రీకృష్ణ పెద్దకర్మ సందర్భంగా,చిలకలపూడిలోని తమ స్వగృహం వద్ద, విద్యార్థినికి ఫీజు సహాయాన్ని ప్రత్యక్షంగా అందజేశారు. గతంలో కూడా చలమలశెట్టి బాలాజీ మైత్రి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా, సహాయ కార్యక్రమాలకు సహకరిస్తూ, పేదలు, విద్యార్థులు, అవసరమైన కుటుంబాలకు అండగా నిలిచిన విషయం గమనార్హం. ఈ సహాయంతో ఒక ప్రతిభావంతమైన విద్యార్థిని చదువు మధ్యలో ఆగకుండా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, అనిల్, రమాదేవి, దీప్తి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల ముఖచిత్రం మార్చుతున్న పల్లెపండుగ 2.0.



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** పల్లెపండుగ 2.0తో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. జి.కొండూరు మండలంలోని గంగినేని గ్రామంలో 15వ ఆర్థికసంఘం నిధులు రూ.36 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణానికి, రూ.25 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ గ్రామాల ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసే లక్ష్యంతో 'పల్లె పండగ 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గ్రామాల్లోనే హెల్త్ సెంటర్ల నిర్మాణంతో ప్రజల సమగ్ర ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు వారి ఇంటి దగ్గర నాణ్యమైన వైద్యసేవలు అందించడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కారు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, మరోవైపు పేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. జి.కొండూరు-గంగినేని వరకు కేజీవై రహదారి ఈ జనవరి నెలాఖరులోగా పూర్తి అవుతుందన్నారు. మైలవరం నియోజకవర్గంలో రూ.30 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేశామన్నారు. పంచాయతీ రాజ్ బీటీ రహదారుల అభివృద్ధికి మరో రూ.12.20 కోట్లు మంజూరు అయినట్లు వెల్లడించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా పర్యవేక్షించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. గంగినేని గ్రామంలో అన్ని రోడ్లు సంపూర్ణంగా సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని అన్నారు. గంగినేనిలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకి ఘనస్వాగతం లభించింది. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## కవులూరులో హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

**జి కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం కవులూరు గ్రామంలో రూ.36 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా హెల్త్ సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. వైద్య సేవలను ఉచితంగా గ్రామీణ ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు హెల్త్ సెంటర్లు ఉపయోగపడతాయన్నారు. ముందుగానే బీపీ, షుగర్ పరీక్షలు చేసుకోవడంతో వాటి ద్వారా వచ్చే ప్రాణాంతక వ్యాధులను గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ప్రారంభం






**వత్సవాయి జనవరి 7 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన వత్సవాయిలో వెంకటేశ్వర కాన్వెంట్ సమీపంలో నూతనంగా నిర్మించిన బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ తరపున ప్రారంభిస్తున్నట్లు బీ వి వి కే ట్రస్ట్ కమిటీ చైర్మన్ చిరుమామిళ్ల హనుమంతరావు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 ఆగస్టులో బోగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం శంకుస్థాపన చేయటం జరిగిందని తెలిపారు. ఈ శంకుస్థాపనకు స్థల దాత, స్థానికులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పులిపాటి చంద్రశేఖర్ సతీమణి పుష్పలత ఆధ్వర్యంలో నాలుగున్నర సెంట్లు స్థలం ఉచితంగా అందించినట్లు తెలిపారు. అంతే కాకుండా మరో రెండు సెంట్లు కోసం ప్రముఖ వ్యాపారవేత్త బొగ్గవరపు వెంకట రాజారావు,, మండే పూడి చంద్రశేఖర్ లు వీరిద్దరూ రెండు లక్షల రూపాయలతో రెండు సెంట్లు స్థలాన్ని అదనంగా కొని ఇవ్వటం జరిగిందని తెలిపారు. మొత్తం ఆరున్నర సెంట్లు లో బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ పేరుతో నూతన భవనాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. విజ్ఞాన కేంద్రానికి ప్రజలు సహాయ సహకారాలు ఆర్థికంగానూ, వస్తు రూపంగానూ సహకరించారని తెలిపారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్మాణానికి సుమారు 40 లక్షలు రూపాయలతో దాతల సహకారంతో నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈనెల 8వ తేదీన గురువారం ప్రారంభించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి స్థానికులు, పులిపాటి చంద్రశేఖర్ వారి సతీమణితో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, పారమౌంటు అధినేత వెనిగళ్ళ సురేష్ చిరుమామిళ్ల రాంబాబు (అమెరికా), గౌరవ అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం రామానగరంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వెలగం అనూరాధ కుటుంబానికి బీసీ సంఘ నేత చెన్ను రంగారావు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన లక్ష్మీపురం సొసైటీ మాజీ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ చేతులమీదుగా బాధితురాలికి నగదును అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నేతలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## హెల్మెట్ పై అవగాహన కల్పించిన పోలీసులు



పామర్రు మేజర్ న్యూస్ : మచిలీపట్నం – విజయవాడ జాతీయ రహదారిపై పామర్రు పోలీసులు హెల్మెట్ పెట్టుకోని వాహనదారులకు అవగాహన కల్పించారు. అంతేకాక వేగంతో వెళుతున్న, అలాగే రికార్డులు సరిగా లేని వాహనాలను గుర్తించి దాదాపు 20 వాహనాలకు 11,700 రూపాయలు జరిమానాలను విధించినట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వాహనదారులకు హెల్మెట్ వలన కలిగే ఉపయోగాలను వివరించడంతోపాటు లేకపోవడం వల్ల జరిగే నష్టాలను కూడా ఆయన విశదీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ ఐ ఎల్.సత్యకళ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయంలో పార్టీల ప్రతినిధుల సమావేశం



**పామర్రు మేజర్ న్యూస్:** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శ్రీదేవి సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన ఏడుగురు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ, ఓటరు కార్డుల్లో ఉన్న జెండర్ మార్పులు, ఫోటో మార్పులు తదితర వివరాలలో పొరపాట్లు ఉన్నట్లయితే వాటిని వెంటనే సరిచేసుకోవాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు, సవరణలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో తహసిల్దార్ జి.రవికాంత్, కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## పెదపారుపూడిలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదపారుపూడిలో బుధవారం నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ చప్పిడి సమీర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీను నాయక్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ నూతన పట్టాదారు పాసు పుస్తకాల్లో ఎటువంటి మార్పులు చేర్పులు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి వాటిని సరి చేయించుకోవాలని కోరారు. అలాగే ఎటువంటి భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడే పేట మార్కెట్ యార్డ్ కమిటీ అభినందన సభ....

### ఎంపీ కేశినేని శివనాద్ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ రాక కోసం భారీ ఏర్పాట్లు

### ఆహ్వాన భారీ ఫ్లెక్సీలతో పసుపు మయంగా మారిన జగ్గయ్యపేట



**జగ్గయ్యపేట డిసెంబర్ 7 మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పీఠం ఎస్సీ మహిళకు కేటాయించిన విషయం విధితమే. ఎన్నో రకాల పోరాటాలతో ఎట్టకేలకు చైర్మన్ పీఠం అధికార పార్టీ ఎస్సీ మహిళకు కేటాయించడంతో దళితులకు అధికారం దక్కటంతో అన్ని వర్గాల ప్రజలలో సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఈ తరుణంలో అగ్రవర్గాల చైర్మన్ పీటం అధిరోహించిన వారి అభినందన సభ కంటే మిన్నంగా ఘనంగా దళిత చైర్మన్ అభినందన కార్యక్రమం జరిపించాలని చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను అభిమానులను సానుభూతిపరులను ఆహ్వానించినట్లుగా తెలుస్తుంది.. ఈ అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని శివనాద్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ కే డి సి సి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, జిల్లా నాయకులను ఆహ్వానించినట్లుగా వారు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు వారు తెలిపారు. ముందుగా పట్టణంలో బైక్ ర్యాలీతో పాటు దివంగత పార్టీ నాయకులకు నివాళులు అర్పించడం, వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కనుక ఈ అభినందన సభ కార్యక్రమాన్ని కి ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని అలాగే మార్కెట్ యార్డ్ అభివృద్ధి కమిటీని ఆశీర్వదించి మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని చైర్మన్ మల్లెల సీతమ్మ కోరారు.

## వసంతరావు చిత్రపటానికి నివాళులర్పించిన విక్కుర్తి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ కాలనీకి చెందిన అయ్యప్ప మెస్ శ్రీనివాసరావు తండ్రి వసంత రావు మస్తాన్ రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు. బుధవారం శ్రీనివాసరావు గృహంలో మస్తాన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీను, భూపతి నాంచారయ్య, రేపల్లె ముసలయ్య, బర్మా బుజ్జి,రేపల్లె ఈశ్వరరావు,ఎస్ పున్నయ్య చౌదరి పాల్గొన్నారు.

## వైభవంగా పాలకమండలి ప్రమాణ స్వీకారం



**కోడూరు మేజర్ న్యూస్ :** విశ్వనాథపల్లి శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి దేవస్థానం నూతన పాలకమండలి బుధవారం కొలువురింది. ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్‌గా వెంకట సూర్య నరసింహారావుతో పాటు ఇతర సభ్యులచే మచిలీపట్నం దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి పాలకమండలితో చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

## రెండవ రోజు కొనసాగిన రిలే నిరాహారదీక్షలు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** దీర్ఘ కాలికంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోరుతూ సహకార సంఘాల ఉద్యోగులు చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు వద్ద రెండవ రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఉద్యోగులు దీక్షలో కూర్చుని తమ డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వానికి తమ నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగసంఘ నేతలు మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న వేతన సవరణలు చేసి అప్పటివరకు మధ్యంతర భృ తిఇవ్వాలనీ, గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి గ్రాట్యుటీ చెల్లించాలనీ, ప్రభుత్వ ఉద్యోగుల వలె పదవీవిరమణ వయస్సు 62 సంవత్సరాలు అమలుపరచాలనీ, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, ఉద్యోగుల జీతభత్యాలను డీఎల్ఎస్ఎఫ్ ద్వారా నిరవధికంగా చెల్లించాలనీ తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రిలేదీక్షలో సహకార సంఘాల ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్ర రవికుమార్, జిల్లా అధ్యక్షులు తోట కృష్ణారావు, సీఈవోలు ఎస్ఎస్.చక్రపాణి, కోరుకొండ శ్రీనివాసరావు, ఎల్.రమేష్, కంఠంనేని నాగేశ్వరరావు, పుట్టి వెం కటేష్బాబు, పి.సోమేశ్వరరావు, వేముల నాగమణి తదితరులు పాల్గొన్నారు..

## 10న అంబేద్కర్, జగ్జీవన్ రావు విగ్రహావిష్కరణ



**మైలవరం, మేజర్ న్యూస్ :** గంపలగూడెం మండలం పెద్ద కొమిర గ్రామంలో ఈనెల 10వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహావిష్కరణ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోటా బెనర్జీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆలూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన గంపలగూడెం మండలం పెద్ద కొమిర గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ విగ్రహాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి ఇంకొల్లు జమలయ్య, నియోజకవర్గ పరిశీలకులు కే రామారావు, పి ఏసురత్నం,జి కొండూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు శేఖర్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు కే ప్రేమ్ బాబు, బి శోభన్ బాబు, ఎం సువర్ణ రాజు పలువురు పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలను కళ్లారా చూడండి....

## తాగునీటి సమస్యపై అధికారులను కదిలించిన ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య





**వత్సవాయి జనవరి 7 మేజర్ న్యూస్ :** మండల కార్యాలయ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య వివిధ శాఖల అధికారులతో కీలకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా వత్సవాయి గ్రామంలో కొనసాగుతున్న తాగునీటి సమస్యపై తీ వ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు గంభీరంగా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. గత ఎన్నో సంవత్సరాలుగా గ్రామంలోని అనేక కాలనీల్లో సరైన తాగునీటి సదుపాయం లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇప్పటికీ ట్యాంకర్ల నీటిపై ఆధార పడాల్సి వస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల జీవన సమస్యలు ఫైళ్లలో కాదు, నేలమీద కనిపించాలి అంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని స్పష్టం చేస్తూ, మాటలకంటే పనుల్లో మార్పు కనిపించాలన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు తాగునీటి పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపిన నేపథ్యంలో, సంక్రాంతి పండుగ నాటికి వత్సవాయి గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని శాసనసభ్యులు స్పష్టంగా కోరారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలపై కూడా దృష్టి సారించాలని, భూ సంబంధిత సమస్యలు, ధృవపత్రాల జారీ, దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాల్లో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలగకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అధికారులు బాధ్యతగా సమస్యలు తీర్చాలని సూచించారు. ప్రజల నమ్మకమే ప్రభుత్వానికి బలమని పేర్కొన్న శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, అధికారులందరూ ఒకే లక్ష్యంతో, సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంబాబు, తాసిల్దార్ రాహుల్ డి ఈ ఆర్డబ్ల్యూఎస్ రామలింగేశ్వరరావు అధికారులు, అన్ని శాఖల అధికారులు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# పటమట నారాయణ ఇ.ఎం.స్కూల్‌లో ఈ చాంప్స్ మాస్టర్ చెఫ్ పోటీ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** పటమట నారాయణ ఇ.ఎం.స్కూల్‌లో ఈ చాంప్స్ మాస్టర్ చెఫ్ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక విద్యార్థులు చెఫ్‌ల వేష ధారణలో వచ్చి నిప్పు లేకుండా వంట చేయడం, శాండ్‌విచ్, ఫ్రూట్ సలాడ్, వెజ్ సలాడ్, జ్యూస్‌లు ఇంకా వివిధ రకాల ఆహారాలను సిద్ధం చేశారు.





ఈ సందర్భంగా క్ల స్టర్ ప్రిన్సిపాల్ ముత్తా రెడ్డి మాట్లా డుతూ విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత, పాక నైపుణ్యాలను ప్రదర్శించి ఎన్నో రకాల వంటకాలను తయారు చేసుకుని పాఠశాలకు తీసుకొనివచ్చారన్నారు. మాస్టర్ చెఫ్ పోటీలలో విద్యార్థులు పాల్గొనడం, వారిని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, ఈ ఛాంప్స్ కోఆర్డి నేటర్ జహూర్ ఫాతిమా, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసిన తిరువూరు పట్టణ నాయకులు



**తిరువూరు మేజర్ న్యూస్ :** తిరువూరు పట్టణం తెలుగు దేశం పార్టీ కమిటీ సభ్యులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు, తిరువూరు బ్రాహ్మణ షరిషత్ సభ్యులు బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. పండితులు ఆశ్వీరచనం అందించారు. అనంతరం సీనియర్ నాయకులు కందిమళ్ల శేషగిరిరావు రూపొందించిన 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు పట్టణం టిడిపి అధ్యక్షుడు మల్లెల శ్రీనివాస్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ పర్వతం శ్రీనివాసరావు, శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ జంగాల మురళీకృష్ణ, స్టేట్ హాజ్ కమిటీ డైరెక్టర్ అబ్దుల్ హుస్సేన్, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ జేడిమళ్ల సత్యవతి, 20 వ వార్డు అధ్యక్షుడు, కార్యదర్శులు, తిరువూరు బ్రాహ్మణ షరిషత్ చైర్మన్ అరిపిరాల వెంకటప్పయ్య శాస్త్రి, పండితులుభవానీ రాధకృష్ణ, కె.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

# 11న నగరంలో అయోధ్య రామ మందిరం నమూనా ప్రదర్శన

**విజయవాడ, మేజర్ న్యూస్ :** అయోధ్య రామ మందిరం నమూనా ప్రదర్శన ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని విజయవాడ ట్రేడ్ ఫెయిర్, కే ఎస్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు మొగిలి రాజా తెలిపారు. రామ మందిరం నమూనాను విజయవాడ నగర ప్రజలు ఉచితంగా వీక్షించే అవ కాశం కల్పించినట్లు తెలిపారు. శ్రీరామచంద్రుని దివ్య ఆశీస్సులు పొందేం దుకు నగర ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. భవానిపురం లోని బబ్బురి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విజయవాడ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ కే ఎస్ ఫన్ ఫెయిర్ నిర్వాహకులు మొగిలి రాజా, మణి, నారాయణ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ప్రారంభానికి పలు అవాంతరాలు ఎదు రైన నేపథ్యంలో ఎగ్జిబిషన్ యొక్క సమస్యను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఈ విషయాన్ని పరిశీలించి,సానుకూలంగా స్పందించి సరైన పరిష్కారం చూపించి అనుమతుల విషయంలో సహకారం అందించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నగ ర ప్రజలకు ట్రిపుల్ ధమాకా ఆఫర్ కింద అయోధ్య రామ మందిరం నమూ నా, టైటానిక్ షిప్ నమూనా, లండన్ బ్రిడ్జి నమూనా ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఒకే టికెట్టుపై మూడు అద్భుత కళాఖండాలను వీక్షించే అవకాశం కల్పించినట్లు వారు తెలియజేశారు. పండుగ సందర్భంగా ఎగ్జిబిషన్కు వచ్చే చిన్నారుల కోసం జైంట్ విల్ కొలంబస్ టోరాటోరా బ్రేక్ డాన్స్ ఆట వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. మహిళల కోసం కలంకారి ఉత్పత్తులు, కలక త్తా జైపూర్ ఢిల్లీ మహారాష్ట్ర చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. సంక్రాంతి పండుగను నగర ప్రజలు తమ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వారు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎర్రపాటి విష్ణువర్ధన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





## బందరు పోర్ట్ & ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులపై మంత్రులు సమీక్ష

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్టణం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బందరు పోర్ట్ అభివృద్ధి పనులు & ఫిషింగ్ హార్బర్ పనులపై అధికారులతో సహచర మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి రాష్ట్ర పెట్టుబడులు & మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, జాయింట్ కలెక్టర్ సీ ఎం నవీన్, మారిటైం బోర్డ్ సీఈ రాఘవరావు, మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టు, ఫిషింగ్ అర్బన్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశమని, ఈ ఏడాది మచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కాంట్రాక్టర్లకు ఆదేశం ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి పోర్ట్ అభివృద్ధి పనులు, పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్‌కు మాజీ మంత్రి నడికుదుటి నరసింహారావు పేరు పెట్టడం మంచి నిర్ణయం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నరసింహారావు పేరు పెట్టడానికి సీఎం సుముఖం తెలపడం మంచి పరిణామం అన్నారు.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ





**గూడూరు, మేజర్ న్యూస్ :** పదో తరగతి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల 75 రోజుల జి ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమ అమలును పరిశీలించడానికి గూడూరు మండలంలో డైట్ కళాశాల లెక్చరర్ మద్ది బాబు రాజేంద్రప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కప్పలదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గూడూరు లోని మోడల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పాఠశాలకు విద్యార్థుల హాజరు, స్లిప్ టెస్ట్‌ల జవాబు పత్రాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుకై ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షలకు ప్రణాళికబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జీవీ విజయ కుమారి, వై. సుధారాణి పి విజయభారతి పాల్గొన్నారు.

## నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జ్‌గా శివన్నారాయణ



**పెడన మేజర్ న్యూస్:** నియోజకవర్గం టిడిపి అనుబంధ విభాగం ఐటిడిపి ఇంచార్జ్‌గా గంగమోలు శివన్నారాయణ నియమితులయ్యారు. బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన శివన్నారాయణ పార్టీకి గత కొన్నేళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్నాడు. శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు ఈ పదవిని కేటాయించారు.పార్టీపై నిబద్ధతతో చురుకైన కార్యకలాపాలతో ముందుకు సాగుతున్న ఆయనకు ఈ బాధ్యత రావడం ప్రశంసనీయం. ఈ సందర్భంగా ఆయనకు మల్లేశ్వరం గ్రామ సర్పంచి చెన్ను శ్రీనివాస్ తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999